# సహ ప్రయాణికులు

నగరంలో బిజి ట్రాఫిక్ సిగ్నల్ కూడలి. ఎర్రలైటు. కార్లు, స్కూటర్లు, ఆటోలు, లారీలు, సైకిళ్ళు అన్నీ సడన్ బ్రేకుతో ఆగాయి.

కిష్టిగాడుకార్ల దగ్గరికి పరుగెత్తాడు వాడి చేతిలో కార్లు తుడిచే తువాల్లున్నాయి.

పదిమందినడిగినా ఫలితం లేదు. ఇంతలో గ్రీన్ సిగ్నల్ ! వాహనాలు స్పీడందుకున్నాయి. కిష్టిగాడు ఇంకోవైపుకు పరుగెత్తాడు అక్కడ రెడ్‌సిగ్నల్ వల్ల ఆగిన కార్ల వద్దకు. అక్కడా చుక్కెదురే. దానికి కారణం తువాళ్లు కొనేవాళ్ళు లేకపోవడం కాదు. ఇంకో తువాల్లు అమ్మే కుర్రవాడుండడం! కిష్టిగాడికి కొపం తన్నుకొచ్చింది రెండు సంవత్సరాలుగా ఏకచ్ఛత్ర్యాధిపత్యం వహిస్తున్న తనకు పోటీయా? ఆ అబ్బాయి కాలరు పట్టుకుని ప్రక్కకు లాక్కెళ్ళాడు కిష్టిగాడు.

"ఎవర్నడిగి వచ్చినౌబే? ఇది నా ఇలాకా అని తెలదే?'

"నీ ఇలాకనా? ఎప్పుడు కొన్నవన్నా? ఎంతకు కొన్నవన్నా?" సోమిగాడు కాలర్ విడిపించుకునే ప్రయత్నం చేస్తూ అడిగాడు.

" ఈ కిష్టిగాడంటే నీకు తెల్వదురో! లేకపోతే ఇట్ల మాట్లాడవ్. నోరుమూసుకొని అచ్చిన దార్లె పో. ఫుకట్‌గా నాతో తన్నులు తినకు."

"ఇగో కిష్టన్నా నువ్వు నా కన్నా పెద్దోడివి. నీ తమ్ముడి లెక్క నన్ను గూడ బతుకనియ్యి నువ్వు ఆ లైను జూసుకో నేను ఈ లైన్ల అమ్ముకుంట"

"ఏంది బే, ఊకున్న కొద్ది బాగ మాట్లాడుతున్నౌ? గీ నకరలు నా దగ్గిర పనికి రావు. సప్పుడుదాక ఎట్లచ్చినవో అట్లపో లేకుంటె మంచిగుండది".

"కిష్టన్నా! నాగ్గూడ సేతులున్నై నేనుగూడ మాయమ్మ పాలు దాగిన. నువ్వు రొండుకొడ్తే నేను ఒక్కటన్న ఏస్త. ఇద్దరం గర్లీబోల్లమే. మనన్ల మనకు జగుడమేంటికి? నా మాటినన్నా జర".

"ఒరేయ్ నువ్విట్ల ఇనెటట్టు లేవు" అని లాగి లెంపకాయ కొట్టాడు కిష్టిగాడు . సోమిగాడు కాలితో తన్నాడు. ఇద్దరూ కలియబడ్డారు. క్రిందపడి దొర్లి ఒకరినొకరు కొట్టుకోసాగారు. జనం, వారి చుట్టూ మూగి తమాషా చూస్తున్నారు ఎవ్వరూ వారిని విడిపించే ప్రయత్నం చేయలేదు. సోమిగాడి ముక్కు నుండి రక్తం కారుతోంది. కిష్టిగాడి షర్టు చిరిగింది. చేతులు గీరుకుపోయాయి.

" ఒరే సోమిగా ఏందిరా ఇది?" అని వారిద్దరిని విడిపించాడు ఓ రిక్షా అతను.

ఆయన కొమురయ్య. సోమిగాడుండే బస్తీలోనే ఉంటాడతను.

కిష్టిగాణ్ణి ఇంకో ఆయన పట్టుకున్నాడు ఇద్దరు ఎగరొప్పుతున్నారు. విడిచిపెడ్తే మళ్ళీ కలియబడేట్టున్నారు. కొమురయ్య సోమిగాణ్ణి తీసుకుని రిక్షాలో బయలుదేరాడు. రిక్షా కనుమరుగయే దాకా చూస్తూనే ఉన్నాడు కిష్టిగాడు. వాడి కళ్ళల్లో నిప్పులు.

అది కూలివాళ్ల బస్తీ. అన్నీ తాటిపాకలు. ఓ పాకలో ఎండిన పుల్లలా ఉన్న ఒకామె కుక్కి మంచంలో పడి ఉంది. ఆమె మనెమ్మ. పదేళ్ళ పిల్ల ఆమెకు జావ తాగిస్తోంది. రెండు గ్రుక్కలు మింగిందో లేదో భళ్ళున వాంతి చేసుకుంది మనెమ్మ.

"అమ్మకేమయింది కావేరీ?" అంటూ పాకలోకి వచ్చాడు సోమిగాడు అతని చేతిలో మందుసీసా, ఓ ట్యాబ్లెట్ల ప్యాకెట్టుంది అవి అక్కడున్న స్టూలుపై పెట్టి ఒక్క అంగలో మంచం దగ్గరకు చేరుకున్నాడు. తల్లిని ఒడిసి పట్టుకుని నీళ్ళు త్రాగించాడు. ప్యాకెట్టు నుండి ఓ మాత్ర తీసి మనెమ్మ నోట్లో వేసి మళ్ళీ నీళ్ళు త్రాగించాడు మనెమ్మ కాస్త కుదుటపడింది. ఆమెను మెల్లగా మంచంలో పడుకోబెట్టాడు సోమిగాడు కావేరి తుండుతో మంచం పక్క శుభ్రం చేయసాగింది.

ఇంతలో తలుపు దగ్గర అలికిడి

చూస్తే కిష్టి గాడు! సోమిగాడి ముఖంలో ఆశ్చర్యం! అపనమ్మకం! కిష్టిగాడిలో బాధ, ఆవేదన.

"రా అన్నా! ఆడనే నిల్సుంటివి?" సోమిగాడి పిలుపు ఆ పిలుపులో మార్ధవం ! ఆప్యాయత, అతిధిని ఆహ్వానించే అనురాగం !

కిష్టిగాడిలో సంకోచం. ఇంకా గుమ్మంలోనే నుంచున్నాడు. సోమిగాడు స్వయంగా వెళ్ళి కిష్టిగాడి చేతులు పట్టుకుని తీసుకొచ్చాడు. మూలనున్న చాప పరచి కూచోపెట్టాడు.

"అమ్మకేమయింది తమ్ముడూ" కిష్టిగాడిలో ఆందోళన, సోమిగాడి ఒంట్లో పులకరింపు!

" ఉబ్బసం. దానికి తోడు మూడు రోజుల్నుంచి జరం. సేతుల పైసలేదు. గందుకే మొన్న కోమటి లచ్చన్న దగ్గిర ఉద్దెరకు తువాళ్ళు తీసుకొని అమ్ముతాని కొచ్చిన అయిదు తువాల్లు అమ్మిన కూడా".

ఆ రోజు సోమిగాణ్ణి కొట్టిన దృశ్యం కిష్టిగాని కళ్ళ ముందు కదిలింది. వాడి కళ్ళల్లో పశ్చాత్తాపం. తల్లికి మందులు కొనడానికి డబ్బు కూర్చుకునేందుకు తనకు పోటీగా అమ్మకానికి వస్తే, తనేం చేశాడు? వెనకా ముందు చూడకుండా ఇష్టమొచ్చినట్టు కొట్టాడు.

కిష్టిగాని మనసు కుమిలి పోతోంది.

"నన్ను మాఫ్ జెయ్యి తమ్ముడూ" సోమిగాని రెండు చేతులు పట్టుకున్నాడు కిష్టిగాడు.

"మనన్ల మనకు మాఫీలు, గీఫీలు ఎందన్నా? ఇద్దరిదీ పొట్ట తిప్పలే. అది..నువ్వు మనసుల పెట్టుకొని బాధపడకు. నేనైతే ఎప్పుడో మర్చిన" కావేరి ఇచ్చిన నీళ్లు త్రాగి మనెమ్మకు నమస్కారం చేసి బయలుదేరాడు కిష్టిగాడు. సోమిగాడు వెనకే బయలుదేరాడు.

"కిష్టన్నా! ఇటెందుకచ్చినవే?"

"మీ ఇంటికే అచ్చిన తమ్ముడూ. ఆ నాడు నిన్ను కొట్టినంక బాగ కరాబనిపిచ్చింది.

నిన్ను కల్సి నీతోని మాట్లాడదామని దేవులాడుకుంట మీ బస్తికచ్చిన".

నిజానికి కిష్టిగాడు సోమిగాని అంతు చూడాలని బస్తీకి వచ్చాడు. సోమిగాడు తననెదిరించిన నాటి నుండి, వాని మనసు పగతో రగిలిపోతోంది. వాణ్ణి మళ్ళీ తన జోలికి రాకుండా మంచి గుణపాఠం నేర్పాలని, ఎన్నో తంటాలు పడి సోమిగాడి జాడ కనుక్కున్నాడు. తీరా వాళ్ళింటికి వెళ్ళి అక్కడి సన్నివేశం చూశాక, తన తల్లీ చెల్లీ గుర్తుకు వచ్చారు. మాట మార్చాడు.

"అవును తమ్ముడూ మీ నాయిన్న?"

"కాలం జేసిండు. ఆయన లేకనే మాకీ తిప్పలు. సెప్పాలంటె శాన పెద్ద కతున్నది. మల్ల ఎప్పుడున్న సెపుతా". ఇంటికి పెద్ద దిక్కులేని సోమిగాని కుటుంబ స్థితి చూసి కిష్టిగాడి హృదయం ద్రవించింది. పగ పారిపోయింది. అనురాగం అంకురించింది. "తమ్ముడూ నాకంటే నీకే పైసలు ఎక్క జరూరు ఉన్నయి. నా జాగల నువ్వు రేపటి నుండి తువాల్లు అమ్ముకో, నేనింకెక్కడన్న అడ్డ సూనుకుంట."

"ఆ మాట మర్చిపో కిష్టన్నా. దాని గురించి మనం మల్లకల్సినప్పుడు మాట్లాడుకుందాం. నేనింటికి పోవాలె. అప్పుడప్పుడు ఇంటికి రా".

"అట్లనే తమ్ముడూ" అని కిష్టిగాడు తన బసవైపు అడుగులు వేశాడు.

ఆ తర్వాత వాళ్లు కలుసుకుని, ఒకరి కుటుంబ విషయాలు ఇంకొకరు తెలుసుకున్నారు.

కిష్టిగాడి ఊరు నగరానికి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. రెండొందల గడపలున్న ఆ ఊర్లో వ్యవసాయమే జీవనోపాధి సాధనం. తల్లి, తండ్రి ఇద్దరు రైతుకూలీలే. అయినా తమ పిల్లలను స్కూలుకు పంపించి మంచి చదువులు చెప్పించాలని కోరిక. తాము కలో, గంజో తాగుతూ పిల్లలకు మాత్రం అన్నం, కూరలు పెట్టేవారు. వారి పుస్తకాల ఖర్చుకు కూడా ఎప్పుడూ వెనుకాడలేదు. సుందరి శ్రద్ధగా చదువుకుంటే, కిష్టిగాడు మాత్రం చెడుసావాలకు మరిగాడు. స్కూలు ఎగ్గొట్టి జులాయిగా తిరగసాగాడు. చదువుకోవడం కంటే, వదిలిపెట్టిన ఆంబోతులా తిరగడమే వానికి హాయినిచ్చింది. బీడీలు తాగడం, ఇంట్లో చిన్న, చితక దొంగతనాలు చేయడం, చీట్లాటలో తగలేయడం వాడి దినచర్యగా మారింది. నయానా, భయానా ఎంతో చెప్పారు వాడి తల్లిదండ్రులు. ఆ మాటలు వాని చెక్కలేదు. వాడి ఆగడాలు ఆగలేదు. విసిగి వేసారి ఓ రోజు వాణ్ణి చితకబాదాడు వాళ్ల నాన్న. అంతే...

ఇంటినుండి పారిపోయి సిటీకి వచ్చాడు కిష్టిగాడు. తనలాంటి వాళ్ళు సిటీలో కొల్లలు. వారితో కలిసి తన ఊరి కార్యకలాపాలే కాస్త పెద్ద ఎత్తున కొనసాగించాడు. అడిగే వారు లేరు. ఇష్టారాజ్యం. ఇంకా విచ్చలవిడిగా తిరగడం మొదలు పెట్టాడు.

ఓ రోజు ! ఆర్టీసీ బస్సు రద్దీగాఉంది. నాలుగురోడ్ల జంక్షనులో కిష్టిగాడు మాటు వేశాడు. బస్సు ఆగింది. ప్రయాణికులు ద్వారం వద్దకు దూసుకుపోయారు. దిగేవాళ్లు దిగుతున్నారు. ఎక్కేవాళ్లు, వాళ్ళని దిగనీయడం లేదు. దిగేవాళ్ళు ఎక్కేవాళ్ళని ఎక్కనీయడం లేదు. కిష్టిగాడు తన హస్త లాఘనం చూపించాడు. ఇంకో బస్సు కొరకు వేచి ఉన్న ఓ ప్రయాణికుడు కిష్టిగాని నిర్వాకం కళ్ళారా చూశాడు. వెంటనే వాడి కాలరు పట్టుకున్నాడు. పర్సుపోయిన ఆసామిని కేకేసాడు. అతను బస్సు వదిలి వీరి దగ్గరకు వచ్చాడు. కిష్టిగాడు

రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఎముకల్లోకి సున్నం లేకుండా తుక్కు దులిపారు జనం. చాలామంది తమ చేయి తీటను వదిలించుకున్నారు. ఆ తర్వాత పోలీసుస్టేషన్లో అప్పగించారు. అక్కడా బడితపూజ జరిగింది. ఆ తర్వాత కోర్టులో మూన్నెల్ల కఠిన శిక్ష పడింది. యుక్త వయసు రానందువల్ల రిమాండ్ హోమ్‌కు తరలించారు. ఇంటిని జైలుగా భావించి, పారిపోయి వచ్చిన కిష్టిగాడికి, నిజమైన జైలంటే ఏమిటో రిమాండ్ హోమ్ తెలిపింది. ఏ అదుపు, ఆంక్ష లేకుండా బలాదూర్‌గా తిరిగిన వాడి కాళ్ళకు కళ్లెం పడింది. ఆలోచనలో పడ్డాడు కిష్టిగాడు. తల్లి, తండ్రి, చెల్లి, ఒక్కొక్కరు కళ్లముందు కనిపించారు. వారి హితోక్తులు జ్ఞాపకానికి వచ్చాయి. తమ చేసిన పొరపాటు తెలిసి వచ్చింది.దానితో తన ప్రవర్తనలో మార్పు తేవాలనే కాంక్ష పుట్టింది.

శిక్షా సమయం పూర్తయిన తర్వాత, వార్డెన్ ప్రమేయంతో, ఓ స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న అనాథ శరణాలయంలో చేరాడు కిష్టిగాడు. అక్కడ ఇంకో ప్రపంచం! పరాన్నభుక్కులంటే ఎవరో అనుభవపూర్వకంగా తెలిసింది. అనాథ శరణాలయాన్ని ట్రస్టీలు తమ సొంత జాగీరుగా మార్చారని కిష్టిగాడు అక్కడ చేరిన కొద్దిరోజుల్లోనే గ్రహించాడు. అక్కడి పనివారి మాటలను బట్టి, పిల్లల పేరున వచ్చే విరాళాలు ట్రస్టీలు ఎలా కాజేస్తున్నారో వివరంగా తెలుసుకున్నాడు. మేనేజరు సారథ్యంలో దొంగలు, దొంగలు ఊర్లు పంచుకునే ట్రస్టీల ముఠాను తలచుకుంటే ఏవగింపు కలగసాగింది కిష్టిగాడికి.

శని, ఆదివారాల్లో ఆడవాళ్లు మగవాళ్ళు ఎక్కడెక్కడి నుండో వచ్చి అనాథ శరణాలయం ఆవరణలో చేసుకునే విందులు, కేళీ విలాసాలు చూసి, చూసి విసిగిపోయాడు. దిక్కులేని పిల్లల పేరు మీద నడిచే అనాథశరణాలయాన్ని, తమ వినోద కేంద్రంగా మార్చిన నిర్వాహకుల ఆగడాలతో పోలిస్తే, గత జీవితంలోని తన చేష్టలు చాలా చిన్నవిగా అనిపించాయి వాడికి.

అనాథ శరణాలయం కంటే జైలు జీవితమే ఎన్నో రెట్లు నయమనిపించింది. తను చేసే వెట్టి చాకిరితో వేరెవరో లాభపడడం కిష్టిగాడికి మింగుడు పడలేదు. అందుకే..

ఓ రోజు అదను చూసుకుని అక్కడి నుండి పారిపోయాడు. ఆ తర్వాత కొన్ని రోజులు సంఘర్షణ. తదుపరి సిగ్నల్ దగ్గర తువాళ్లు అమ్మటం, అలా దినాలు, గడుపుతున్నాడు కిష్టిగాడు. ఇక సోమిగాడి ఫ్లాష్ బ్యాక్ !

యాదయ్య ఒక ఫ్యాక్టరీలో ఫిట్టరుగా చేసేవాడు. స్టీలు ఫర్నిచర్, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ఆ కంపెనీ ఉత్పత్తులకు దేశమంతటా మంచి గిరాకీ ఉండేది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఆ సంస్థలో సహజంగానే నిర్వహణ లోపాలు, నిధులు దుర్వినియోగాలు మితిమీరిపోయాయి. ఈ నేపథ్యంలో, కార్మికుల ఆర్నెల్ల సమ్మె అగ్నికి ఆజ్యంపోసినట్లైంది. కంపెనీ లేవకుండా కూలబడింది. యాజమాన్యం కార్మికులను నిందిస్తే, కార్మికులు నిర్వాహకులను దోషులుగా చిత్రించారు. ఆర్నెల్ల తర్వాత కంపెనీ తెరిచారు. సమ్మె విరమించారు కాని నష్టం జరగనే జరిగింది. పోటీ కంపెనీలు, ఆర్నెల్ల ఆ కంపెనీ నిష్క్రియతతో పుంజుకున్నాయి. కంపెనీ వైభవం గతంగానే ఉండిపోయింది. దినదిన ప్రవర్ధమానంగా పెరిగిన నష్టాలు, కంపెనీ ఉనికికి శాశ్వతంగా మంగళం పాడాయి. కారణమేవరైతేనేం. కార్మికులు రోడ్డున పడ్డారు. అలా వీధిలోకి నెట్టబడిన యాదయ్య ఆటో డ్రైవరుగా అవతరించాడు. విధి అతన్ని, అక్కడా వెక్కిరించింది. ఓ ఆర్టీసీ బస్సు యాదయ్యను, అతని

ఆటోను బలి తీసుకుంది. మనెమ్మ, సోమిగాడు, కావేరి దిక్కులేని వారయ్యారు. వాడున్న ఇల్లు అప్పులకు ఆహుతైంది. కాస్త బాగా, ఒక మోస్తరుగా బతికిన కుటుంబం కూలీల బస్తీలో, తాటిపాకలోకి మారింది.

మనెమ్మ కూలీనాలీ చేసి పిల్లలను పెంచుతోంది. వారిని గవర్నమెంటు స్కూలుకు పంపుతోంది. ఆమె జబ్బుతో మంచాన పడేసరికి సోమిగాడు సంపాదన మార్గం వెదుక్కోవాల్సి వచ్చింది. అక్కడా కిష్టిగాడి రూపంలో చుక్కెదురైంది. రిక్షా కొమురయ్యే ఆ కుటుంబానికి పెద్ద అండగా నిలిచాడు. సోమిగాని వ్యధాభరిత గాధ విన్నాక కిష్టిగాడు మరింత చలించిపోయాడు. తల్లి ఆరోగ్యం పట్ల సోమిగాడి ఆరాటం, వాని చెల్లి ప్రేమ, చిన్నవయసులో అంతబాధ్యత నెత్తినేసుకోవడం, కిష్టిగాడిలోని కఠినత్వాన్ని కరిగించాయి. ఏ ఆంక్షలు లేకుండా జులాయిగా తిరిగిన వాడిలో మానవత్వం మేల్కొల్పింది.

"తమ్ముడూ, ఈడెల్లి మనిద్దరం దోస్తులం"

"కాదు అన్నదమ్ములం" సోమిగాడు సవరించాడు.

"అవును, నేనింకా కష్టపడుతా, నా కమాయితో మీ అందర్నీ బతికిస్తా నువ్వు, చెల్లె స్కూలుకు పోవాలె. అమ్మ ఇంట్లనే ఆరాం జేయాలె. నాకింత బువ్వ పెడ్తే నేను కూడా మీతోనే ఉంట".

"గట్లైతే ఇంకేం గావాలె కిష్టన్నా! కాని నేను కూడా నీలాగ కష్టపడుతా. స్కూలుకెల్లి అచ్చి ఏదో ఒక పని చేస్త. మనందరి బరువు నువ్వొక్కడివే ఎట్లా మోస్తవు?

"సరే తమ్ముడూ, నీ మాటనే కానియ్యి రోడ్డు మీద తువాల్లమ్ముతనంటె నేనొప్పుకోను. నా దోస్త్ ది జిరాక్సు షాపున్నది. అక్కడ నిన్ను ఉంచుతా. స్కూలుకెల్లి అచ్చినంక సాయంత్రం మూడు నాల్గు గంటలు పని జేత్తివంటే ఎంతో కొంత పగారత్తది మన చిల్లర కర్సులకు పనికొత్తయి.

"... బాగుంది. నీ సామాను మనింటికి తీసుకద్దం పద. ఒకనాడు మీ ఊరికిపోయి అమ్మా, నాయిన్న, చెల్లెను చూసొద్దం. ఆల్లకు నీ మీద ఎంత ఫికరున్నదో"

కిష్టిగాని కళ్లు చెమర్చాయి. సోమిగాని కుడిచేయిని కళ్ళకద్దుకున్నాడు.

ఏ బంధుత్వం లేని కిష్టిగాడు, సోమిగాడు, జీవనయానంలో సహ ప్రయాణికులుగా ముందుకు కదిలారు. వారి జీవితంలో ఓ కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

**ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ఉగాది సంచిక ఏప్రిల్ 2003**